సాక్షి ఒడిశా

శుక్రవారం । 7 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,35,654లు, బంగారం 180 మిల్లీగ్రాములు, వెండి 30 గ్రాముల 650 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య

రాష్ట్రవ్యాప్తంగా ఒడియా మహిళలు సావిత్రి అమావాస్య పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు.

- 8లో

నూతన ముఖ్యమంత్రిగా గిరీష్‌చంద్ర ముర్ము?



ఒడిశా రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా గిరీష్ చంద్ర ముర్మును ఎంపిక చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

- 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే మంగు ఖీలోకు పాముకాటు



చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే మంగు ఖీలో

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ ఎమ్మెల్యేగా గెలిచిన మంగు ఖీలో బుధవారం పాముకాటుకు గురయ్యారు. రాత్రి తన సొంత గ్రామమైన కోరుకొండ సమితి కధమ్‌గూడలో ఇంటి బయట ఫోన్ మాట్లాడుతున్న సమయంలో విషసర్పం కాటు వేసింది. వెంటనే అతడు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు . అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం బాగానే ఉన్నట్లు డాక్టర్లు తెలియజేశారు.

నీట్‌లో రాంతరుణ్ తేజ్ ప్రతిభ



పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి కోర్సండ గ్రామానికి చెందిన కొల్లి రాంతరుణ్ తేజ్ నీట్ పరీక్షల్లో సత్తా చాటాడు. 2024–25 విద్యా సంవత్సరంలో పరీక్షలో ఆల్ ఇండియా 21,000 ర్యాంకు సాధించాడు. రాంతరుణ్ తల్లిదండ్రులు కొల్లి జీవరత్నం , అరుణకుమారిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. దీంతో పర్లాకిమిడి మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

మరింత కష్టపడి పనిచేస్తాను

- అపరాజిత షడంగి



లింగరాజు మహా ప్రభువు అర్చనకు పూలబుట్టతో బయల్దేరిన ఎంపీ అపరాజిత షడంగి

భువనేశ్వర్: లోక్‌సభకు వరుసగా రెండోసారి ఎన్నికైన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అపరాజిత షడంగి ఈసారి మరింత కష్టపడి పనిచేస్తానని ప్రకటించారు. భువనేశ్వర్ లోక్‌సభ ఎంపీగా రెండోసారి ఎన్నికైన సందర్భంగా ఆమె స్థానిక ఏకామ్ర క్షేత్రం సందర్శించి మహాప్రభువు లింగరాజుని దర్శించుకున్నారు. దేవస్థానం బయట సింహద్వారం ఆవరణలో ఆమె అందుకున్న డిక్లరేషన్ ఫార్మం ఉంచి సాష్టాంగ ప్రణామం చేసి పలువురి దృష్టిని ఆకట్టుకున్నారు.

అప్పలస్వామికి అభినందనల వెల్లువ



కద్రకను అభినందిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

రాయగడ: రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన అప్పల స్వామి కద్రకకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక జేఎస్‌కోలోని అతని కార్యాలయంలో వివిధ సంస్థలకు ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలతో అభినందిస్తుండడంతో కార్యాలయం పూర్తిగా కిక్కిరిసిపోతోంది. తెరువలిలోని ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్ సంస్థ (ఇంఫా) పీఆర్వో శక్తి పాణిగ్రాహి ప్రత్యేకంగా హాజరై కద్రను అభినందించారు. తనను ఎంతో ఆదరించి గెలిపించిన వారందరికీ కద్రక ధన్యవాదాలు తెలియజేశారు.

నోటాకు 4,288 ఓట్లు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా(ఎస్టీ) నియోజకవర్గం ఎన్నికల ఫలితాల్లో నోటాకు 4,288 ఓట్లు పడటం చర్చనీయాంశమైంది. ఎస్టీ నియోజకవర్గం అయినటువంటి మోహనాలో అనేక కొండ ప్రాంత, ఆదివాసీ గ్రామాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గొమాంగో సమీప బీజేపీ అభ్యర్థి ప్రశాంత్ మల్లిక్‌పై కేవలం 4,281 ఓట్ల తేడాతో గెలిచారు. దీంతో ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ప్రచారం చేసి ఉంటే బాగుండేదని పలువురు భావిస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు మరో ఐదుగురు ఉన్నా వారికి నోటా కంటే తక్కువ ఓట్లు లభించాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేయకపోవడం, ఓటు వినియోగంపై అవగాహన కల్పించకపోవడమే కారణమని భావిస్తున్నారు.

సన్నాహాలు షురూ..!



- రాష్ట్రంలో తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు
- జనతా మైదానం వేదికగా ప్రమాణ స్వీకారం
- ముఖ్యమంత్రి పేరుపై సర్వత్రా ఉత్కంఠ

భువనేశ్వర్:

రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనెల 10న కొత్త మంత్రి మండలి జనతా మైదానంలో ప్రమాణ స్వీకారం చేయనుంది. సువిశాల జనతా మైదానంలో గవర్నర్ రఘుబర్ దాస్ కొత్త ముఖ్యమంత్రి, మంత్రులతో ప్రమాణం చేయిస్తారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది.

50 మంది అధికారులకు బాధ్యతలు

అధికారిక కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను 50 మంది ప్రభుత్వ అధికారులతో కూడిన బృందానికి అప్పగించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శుల హోదాతో కూడిన బృందంలో 9 మంది ఐఏఎస్‌లు, ఒక ఓఎఫ్ఎస్, 40 మంది సీనియర్ ఓఏఎస్ అధికారులు ఉన్నారని సమాచారం. దీనికి సంబంధించి ఈనెల 8న ఇడ్కో మేనేజింగ్ డైరెక్టర్ భూపీందర్ సింగ్ పుణియా నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని అధికారుల బృందానికి సూచించారు. ఇడ్కో టవర్‌లో జరగనున్న ఈ సమావేశంలో ఈ కొత్త సర్కారు ప్రమాణస్వీకారోత్సవ వేడుక ఏర్పాట్లపై సవివరంగా చర్చించనున్నారు.

త్వరలో ముఖ్యమంత్రి పేరు ప్రకటన

త్వరలో ముఖ్యమంత్రి పేరును భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలతో కేంద్ర నేతలు చర్చించిన తర్వాత బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కానుంది. ఈ మేరకు బీజేపీ ఎంపీలు గురువారం ఢిల్లీ వెళ్లారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో 78 స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా 147 మంది సభ్యుల అసెంబ్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు సౌకర్యవంతమైన మెజారిటీని గెలుచుకోవడం గమనించదగ్గ విషయం. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ఎన్నికలకు వెళ్లింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం పురస్కరించుకుని భూమిపుత్రగా ముఖ్యమంత్రి అభ్యర్థిని పార్టీ ఎంపిక చేస్తుందని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ ప్రకటనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

వలస కార్మికులపై ప్రత్యేక దృష్టి

- కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి



సప్తగిరి ఉలక

రాయగడ: రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఎంతోమంది యువకులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. ఇకపై వారికి రాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా తగు చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని కొరాపుట్ లోక్‌సభ నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించిన సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. రాయగడ జిల్లాలో వలస కార్మికుల మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతీ ఏడాది ఎంతోమంది ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి అనారోగ్యం, ఇతర కారణాల వలన మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సమస్యలను కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఆదివాసీ, హరిజన ప్రాంతంగా గుర్తింపు పొందిన కొరాపుట్ లోక్‌సభ పరిధిలోని కొరాపుట్, రాయగడ జిల్లాల్లో ప్రజలకు మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఆరు నియోజకవర్గాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయడం వలనే విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాయగడలో రైల్వే డివిజన్ పనులు మరింత ముమ్మరంగా కొనసాగేలా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించే విధంగా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానన్నారు.

బీఎస్‌కేవై హెల్త్ కార్డులు చెల్లుబాటు



- రాష్ట్ర వైద్య, సంక్షేమ శాఖ పీఆర్వో ఉమాకాంత మహాపాత్రో

పర్లాకిమిడి: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో బీజేడీ హయాంలో ప్రవేశపెట్టిన బీఎస్‌కేవై (బిజూ స్వస్థ్య కల్యాణ్ యోజనా) పథకం కింద ప్రజలకు విడుదల చేసిన స్మార్ట్ కార్డులు ఇకపై చెల్లవని అనేక సోషల్‌మీడియా మాధ్యమాల్లో ఫేక్ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, సంక్షేమ శాఖ పీఆర్వో ఉమాకాంత మహాపాత్రో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కార్డులు పనిచేస్తాయని, ఆస్పత్రులు ఈ కార్డులను తిరస్కరిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా జెమ్స్ ఆస్పత్రిలో సైతం బీఎస్‌కేవై కార్డులు చెల్లుబాటు అవుతున్నాయని రాగోలు జెమ్స్ అధికారులు తెలియజేశారు.

లక్ష్మీ బస్సులపై లోగోలు తొలగింపు



లోగోలు తొలగించిన దృశ్యం



లక్ష్మీ బస్సుపై ఉన్న లోగోలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో లక్ష్మీ బస్సులపై బీజేడీ ప్రభుత్వ లోగోలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో బస్సుల రాకపోకలపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే బస్సు డ్రైవర్లు సైతం తమ ఉద్యోగాలు ఉంటాయో లేదోననే ఆందోళనలో ఉన్నారు. ఈ బస్సుల్లో మహిళలు, విద్యార్థులు రూ.5 టిక్కెట్టు చార్జికే ప్రయాణాలు చేసేవారు. కొత్త ప్రభుత్వం బస్సులను రద్దుచేస్తే మరలా పాత రోజుల మాదిరిగా ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ప్రభుత్వం బస్సులను ఎప్పటిలాగే సక్రమంగా నడిపించాలని కోరారు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు



సమగ్ర నివేదిక అందజేసిన సీఈవో నికుంజ బిహారి ధొలా

భువనేశ్వర్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత రాష్ట్రంలో కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేసే ప్రక్రియ గురువారం నుంచి ఆరంభమైంది. స్థానిక రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్‌తో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సమావేశమయ్యారు. కొత్త శాసనసభ ఏర్పాటుకు వీలుగా అధికారిక (గెజిట్) ఉత్తర్వు ప్రతిని సీఈవో నికుంజ బిహారీ ధొలా గవర్నర్‌కు సమర్పించారు. దీంతో రాష్ట్రంలో కొత్త సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తుందని అధికారిక వర్గాలు తెలిపాయి. సీఈవో వెంట భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు సంబంధించి ఎన్నికల సంఘం ఉత్తర్వులు, ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌ను గవర్నర్‌కు అందజేశారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సులభంగా, శాంతియుతంగా నిర్వహించినందుకు రాష్ట్రంలోని ఎన్నికల సంఘం, అనుబంధ ఎన్నికల యంత్రాంగాన్ని గవర్నర్ అభినందించారు.

తారాప్రసాద్ విజయోత్సవ ర్యాలీ



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఆనందంతో డాన్స్‌లు చేస్తున్న పార్టీ శ్రేణులు

జయపురం: నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రథొపాడియ నుంచి ప్రారంభమైన ర్యాలీ జయపురంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ భవనానికి చేరగా ఎమ్మెల్యే కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయం ప్రజలకు అంకితమన్నారు. మూడోసారి తనను ఆదరించి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. శాంతి, స్నేహం, అభివృద్ధి, శ్రేయస్సు సందేశంతో తాను ఎన్నికల బరిలో దిగగా, ప్రజలంతా ఏకమై తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని తాను ఎన్నడూ వమ్ము చేయనని ప్రజలకు వాగ్దానం చేశారు. ర్యాలీలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, తారాప్రసాద్ సతీమణి మీనాక్షీ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ చీఫ్ సుకాంత పటా‍్నయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గాప్రసాద్ శర్మ, నిహార బిశాయి, బొరిగుమ్మ సమితి కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, బిజయ నారాయణ సాహు, నిఖిల్ నాయక్, మున్నా పటా‍్నయక్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వద్ద పడిన చెట్టు

మల్కన్‌గిరి:

జిల్లాలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద చెట్లు నేలకొరిగాయి. స్థానిక 18వ వార్డు నూవగూడ ప్రాంతంలో సైకిల్ షాపులు, వస్త్ర దుకాణాల రేకులు ఎగిరిపోవడంతో సామగ్రి చెల్లాచెదురయ్యింది. మల్కన్‌గిరి - సుకుమ ముఖ్య రహదారిలో భారీ చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గురువారం ఉదయం జిల్లా అగ్నిమాపక సిబ్బంది చెట్లను తొలగించడంతో 10 గంటల నుంచి యథావిధిగా రాకపోకలు కొనసాగాయి. బాధితులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.



మల్కన్‌గిరి - సుకుమ రహదారిలో చెట్టు పడడంతో నిలిచిన వాహనాలు



నూవగూడ వీధిలో ఎగిరిన ఇళ్లు

ముగిసిన అగ్ని గంగమ్మ జాతర



జాతరలో కలశాలతో పాల్గొన్న మహిళలు



అగ్ని గంగమ్మను తోడ్కొని వెళ్తున్న పూజారులు



కళాకారుల ప్రదర్శనలు

కొరాపుట్ జిల్లా సెమిలిగుడ ప్రజల ఆరాధ్య దేవత అగ్ని గంగమ్మ జాతర ఉత్సవాలు ముగిశాయి. మే 27న ప్రారంభించిన అగ్ని గంగమ్మ జాతర ఉత్సవాలు బుధవారంతో పూర్తయ్యాయి. సెమిలిగుడ గ్రామస్తులే కాకుండా ఆ సమితిలో పలు గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు అగ్ని గంగమ్మ జాతరకు పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, బరంపురం నుంచి వచ్చిన కళాకారులు ప్రజలను అలరించారు. ఘట జాతరలో వందలాది మంది మహిళలు కలశాలతో పాల్గొన్నారు.

జయపురం



జాతరలో పాల్గొన్న భక్తజన సమూహం

క్లుప్తంగా

రాజ్‌భవన్ కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ


బుక్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ రాజ్‌భవన్‌లో 'బ్రేకింగ్ ద బారియర్స్, రీచ్ అవుట్ టు పీపుల్' పేరుతో రాజ్‌భవన్ కాఫీ టేబుల్ బుక్‌ని గురువారం ఆవిష్కరించారు. గవర్నర్ ముఖ్య సలహాదారు సంతోష్ కుమార్ శతపతి, ప్రిన్సిపల్ సెక్రటరీ శాశ్వత్ మిశ్రా సమక్షంలో ఈ పుస్తకం ఆవిష్కరించి శ్రద్ధగా పరిశీలించారు.

తొలి ముస్లిం మహిళా ఎమ్మెల్యేగా సోఫియా ఫిర్దౌస్



భువనేశ్వర్: సోఫియా ఫిర్దౌస్ రాష్ట్ర శాసనసభలో తొలి మహిళా ముస్లిం ఎమ్మెల్యేగా విజయం సాధించింది. తాజాగా ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమె బరాబటి - కటక్ నియోజకవర్గం నుంచి తన తండ్రి స్థానంలో కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేసి సత్తాచాటింది. ఈ ఎన్నికలో తన సమీప ప్రత్యర్థి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పూర్ణ చంద్ర మహాపాత్రోపై 8,001 ఓట్ల ఆధిక్యతతో ఆమె విజేతగా నిలవడం విశేషం.

ఢిల్లీకి బీజేపీ ఎంపీలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన పార్లమెంటు సభ్యులు ఢిల్లీకి గురువారం బయల్దేరారు. శుక్రవారం ఒడిశా ప్రభుత్వ ఏర్పాటుపై జరగనున్న సమావేశంలో పాల్గొనేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అధ్యక్షతన రాష్ట్రం నుంచి గెలిచిన 20 మంది లోక్‌సభ సభ్యులు, 1 రాజ్యసభ సభ్యుడు, ముగిసిన శాసనసభ ప్రతిపక్ష నాయకుడు జయనారాయణ మిశ్రా ఢిల్లీకి బయల్దేరిన వారిలో ఉన్నారు. ఈ చర్చలో రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థి ఖరారు ప్రధానాంశం. కేంద్రంలో ఏర్పాటు కానున్న కొత్త ప్రభుత్వంలో రాష్ట్ర ఎంపీలకు మంత్రి పదవుల అవకాశంపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

భువనేశ్వర్: రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల ప్రకటనతో మార్చి 16 నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గురువారం ఎత్తివేశారు. లోక్‌సభ ఎన్నికలు, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల ఫలితాలతో పాటు కొన్ని శాసనసభ ఉప ఎన్నికల ఫలితాలు ప్రకటితం కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎత్తివేసినట్లు కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల సంఘం తెలియజేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు అవుతాయని పేర్కొన్నాయి.

మందసలో దొంగలు పడ్డారు

కాశీబుగ్గ: మందస మండలం మందస మార్కెట్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మందస మార్కెట్‌లో ఉన్న దుకాణాల సముదాయాల్లో పలు దుకాణాల్లోకి దొంగలు చొరబడి దొరికింది దోచుకుపోయారు. కామేశ్వరి మందులు షాపు, పూన జయశంకర్ కిరాణాషాపులలో బుధవారం అర్ధరాత్రి నుంచి మూడు గంటల మధ్యలో తాళాలు పగలుగొట్టి నగదు, విలువైన మందులను దొంగలు పట్టుకుపోయారు. అదేవిధంగా శ్రీసాయి బాబా క్లాత్ స్టోర్ బట్టల దుకాణం తలుపులు విరగగొట్టే ప్రయత్నించినా విజయవంతం కాకపోవడంతో విడిచి పెట్టేశారు. రాత్రి పూట పోలీసులు గస్తీకాయకపోవడమే ఇలాంటి సంఘటనలకు దారి తీసిందని పోలీసులు చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు. మందస మార్కెట్‌లో జరిగిన దొంగతనాలపై మందస ఎస్‌ఐ బి.అనీల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టూరిస్ట్ బస్సులకు తప్పిన ప్రమాదం


అపార్టమెంట్‌లో సేద తీరుతున్న మధ్యప్రదేశ్ వాసులు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం హైవేను ఆనుకొని శ్రీసాయి డెంటల్ కళాశాల సమీపంలోని ఓ అపార్టమెంట్‌లో (హైటెక్ ప్యారడైజ్) మధ్యప్రదేశ్ వా సులు ఓ వంద మంది వరకు కనిపించడం స్థానికులను ఆశ్చర్యపరిచింది. ఇంతమంది ఎందుకున్నా రని ఆరా తీస్తే.. ప్రమాదం విషయం బయటపడింది. మధ్యప్రదేశ్ నుంచి తిరుపతి వెళ్లడానికి నాగాలాండ్ రిజిస్ట్రేషన్ నంబరు గల రెండు బస్సుల్లో వంద మంది వరకు యాత్రికులు రెండు రోజుల కిందట బయల్దేరారు. శ్రీకాకుళం చేరుకునేసరికి గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఓ బ స్సులోని ముందుభాగం టైరు పేలడంతో పాటు రెండో బస్సు తాలుకా బేరింగ్‌లు ఊడిపోవడంతో వాహనాలు కుదుపునకు గురయ్యాయి. డ్రైవర్లు చా కచక్యంగా పక్కకి తీసి ఆపారు. అయితే వాహనాల మరమ్మతులు ఓ పట్టాన పూర్తి కాకపోవడంతో యాత్రికుల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఎక్కువ శాతం ఉండటంతో పక్కనే ఉన్న అపార్టమెంట్‌లో గుంపులుగా వెళ్లి మనిషోచోట సేదతీరారు. మధ్యాహ్నం మూడు గంటలకు బస్సులు సిద్ధమవ్వడంతో తిరుగుపయనమయ్యారు.

భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య

రాష్ట్రవ్యాప్తంగా ఒడియా మహిళలు సావిత్రి అమావాస్య పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. కొత్త వస్త్రాలు ధరించి, కాళ్లకు పారాణి పూసుకుని ముస్తాబయ్యారు. పసుపుతో రూపొందించిన అమ్మవారి విగ్రహానికి పూలతో అలంకరించారు. అమ్మవారి ముందు తమ సౌభాగ్యం పదిలంగా ఉండాలని కోరుతూ గాజులు, పూలు, చీరలను పెట్టి పూజించారు. అదేవిధంగా పిండి వంటలు, పండ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే వేకువజాము నుంచే అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్


రాయగడ: ఇంటిలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు


రాయగడ: లక్ష్మీదేవి మందిరంలో మహిళల సందడి


రాయగడ: పసుపుతో రూపొందించిన అమ్మవారి విగ్రహం


కొరాపుట్: కొలువుదీరిన అమ్మవారు


జయపురం: సావిత్రి అమావాస్య పూజ చేస్తున్న మహిళ


పర్లాకిమిడి: బలుంకేశ్వర మందిరంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: సావిత్రి అమావాస్యను జరుపుకుంటున్న ట్రాన్స్‌జెండర్స్


పర్లాకిమిడి: శనీశ్వర మందిరంలో అమావాస్య పూజలు


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఎల్‌సీ గేటు అతిక్రమణ ప్రాణాంతకం


గేటు దగ్గర అవగాహన కల్పిస్తున్న అధికారులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ చైతన్య దినం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. రహదారి వినియోగదారులకు అవగాహన కల్పించడం ద్వారా లెవెల్ క్రాసింగ్ భద్రతను మెరుగుపరచడం, లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలను నివారించడం ఈ చైతన్య కార్యక్రమం లక్ష్యంగా పేర్కొన్నారు. స్థానిక హరిపూర్ గ్రామ జంక్షన్ రైల్వే స్టేషన్ సమీపంలోని లెవెల్ క్రాసింగ్ గేట్ కేపీ-2 వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంగణంలో సామూహిక అవగాహన కోసం కరపత్రాల పంపిణీ, బ్యానర్ల ప్రదర్శన, పోస్టర్లుతో భద్రతా జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ సామాన్యులకు అవగాహన కల్పించారు. ఖుర్దా రోడ్ సివిల్ డిఫెన్స్ సంస్థ సభ్యులు వీధి నాటకం ప్రదర్శించారు. రైలు రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటడానికి కేవలం కొన్ని సెకన్లు మాత్రమే పడుతుంది. ఈ స్వల్ప వ్యవధిలో ప్రజలు ఓపిక పట్టాలని, గేటు మూసి ఉన్నప్పుడు రైల్వే ట్రాక్‌ను అతిక్రమించవద్దని నుక్కడ్ నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఖుర్దా రోడ్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా) శుభ్ర జ్యోతి మండల్, డిప్యూటీ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ (ఇంజనీరింగ్) ఇ.బెహూరియా, ఖుర్దా రోడ్ సీనియర్ మండల భద్రత అధికారి (ఇన్‌చార్జి) లింగరాజ్ త్రిపాఠి లెవెల్ క్రాసింగ్ అవగాహన కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు.

భార్య గర్భిణి.. మణిపూర్‌లో భర్త మృతి


తేజేశ్వరరావు (ఫైల్)


ప్రమాదపు స్థలంలో పడి ఉన్న తేజేశ్వరరావు

టెక్కలి రూరల్: మణిపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ మెట్ట తేజేశ్వరరావు (38)అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, తోటి స్నేహితులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొన్న తేజేశ్వరరావు తన ఎన్నికల విధులు ముగించుకుని తిరిగి గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి తిరిగి వెళ్తుండగా వారు వెళ్తున్న వాహనం మరమ్మతులకు గురవ్వడంతో దాన్ని రోడ్డు పక్కగా ఆపేసి అధికారులకు సమాచారం ఇస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో పలువురికి తీవ్రగాయాలకు కాగా అందులో ఉన్న టెక్కలి మండాపొలంగా కాలనీకి చెందిన మెట్ట తేజేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో అక్కడి అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య శ్రావణి 5నెలల గర్భిణి. వారిని నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. మృతుడి తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి. తేజేశ్వరరావు మృతి చెందిన విషయం తెలియడంతో టెక్కలిలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


విత్తనాల నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి

నరసన్నపేట: ఎరువుల షాపుల్లో విత్తనాల డీలర్లు అధీకృత కంపెనీల ద్వారా సరఫరా అయిన విత్తనాలు మాత్రమే విక్రయాలు చేపట్టాలని, అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. స్థానిక నాగార్జున రైతు డిపోలో వరి విత్తనాల గిడ్డంగిని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న విత్తనాల రకాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొన్న రైతులు విధిగా రశీదు తీసుకోవాలని, డీలర్లు కూడా తప్పని సరిగా రైతులకు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తే రైతులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అలాగే రైతులు కొన్న విత్తనాల్లో పొలంలో వేసే ముందు మొలక వేసి మొలక శాతం కట్టుకోవాలని సూచించారు. అలాగే రశీదు, విత్తనాల ప్యాకెట్(సంచి) భద్రపరచాలని కోరారు.


10న వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌భాగ్ పేటలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వా మి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈనెల 10న ఉదయం 9గంటలకు జరుగుతుందని ఆలయ ఈఓ శ్యామలరావు తెలిపారు. హుండీలను ఆలయ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవ లా పురపు తవుడు గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీ కొట్టటంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని మామిడిగుడ్డి గ్రామంలో గురువారం టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీని అరికట్టడమే ధ్యేయంగా దాడులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్‌ఈబీ సీఐ రాజశేఖర నాయుడు, సిబ్బంది ఉన్నారు.

హయగ్రీవం నేత్రాలు సజీవం



శ్రీకాకుళమ కల్చరల్: పట్టణంలోని ఫాజుల్‌బాగ్ పేటలో నివాసం ఉంటున్న కొప్పల హయగ్రీవం (74) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మరణాంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయో గపడాలనే సదుద్దేశంతో ఆయన భార్య అరుణ, కుమారుడు జగదీష్ శ్రీనివాస్, కుమార్తెలు పద్మిని కళ్యాణి లు తమ తండ్రి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు హయగ్రీవం కార్నియాలను సేకరించి విశాఖ లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

నూతన ముఖ్యమంత్రిగా గిరీష్‌చంద్ర ముర్ము?


గిరీష్ చంద్ర ముర్ము

పర్లాకిమిడి: ఒడిశా రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా క్యాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఎక్స్‌టెర్నల్ ఆడిటర్‌గా పనిచేస్తున్న గిరీష్ చంద్ర ముర్మును ఎంపిక చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం. 1985 బ్యాచ్‌లో ఐఏఎస్ అధికారిగా ఎంపికైన గిరీష్ చంద్ర ముర్ము గుజరాత్‌లో ప్రధాని నరేంద్రమోదీకి ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా సైతం 2020 వరకూ పనిచేశారు. నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడైన గిరీష్ ముర్ము గురువారం ఒడిశా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయన స్వగ్రామం మయూర్‌భంజ్ జిల్లా బెత్నోతి. అయితే ఇప్పటికే ఒడిశా ముఖ్యమంత్రి పదవి రేసులో సంబల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన ధర్మేంద్ర ప్రధాన్, సురేష్ పూజారి, ఎంపీ వైజయంతి పండా తదితరులు ఉన్నారు. ఈనెల 8లోగా నూతన ముఖ్యమంత్రి పేరును అధిష్టానం ప్రకటించవచ్చని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ప్రకటించారు.

పెళ్లయిన ఆరు నెలలకే..

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 4న మంగళవారం రాత్రి రణస్థలం నుంచి కమ్మసిగడాంలోని తన ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కమ్మసిగడాం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆదినారాయణకు తీవ్ర గాయాలు కావడంతో 108పై శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ మార్గం మధ్యలోనే ఆయన మృతి చెందారు. మృతునికి పెళ్లయ్యి ఆరు నెలలే అవు తోంది. భార్య గుణమాధురి ప్రస్తుతం గర్భిణి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు.

దాబాలో గొడవ.. ఒకరు మృతి


మృతి చెందిన రాంబాబు

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామంలో జాతీయ రహదారి వద్ద గల సంగీత దాబాలో బుధవారం అర్ధరాత్రి దాటాక సిబ్బంది మధ్య జరిగిన గొడవలో మాడుగల రాంబాబు (54) మృతి చెందాడు. దాబా సిబ్బంది, బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాబాలో కొర్లాం గ్రామానికి చెందిన సూర్యనారాయణ మహంతి, పొలాకి మండలం చెల్లయ్య వలస గ్రామానికి చెందిన మాడుగల రాంబాబు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ తరచూ గొడవపడుతుండేవారు. బుధవారం అర్ధరాత్రి పడుకునే సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో సూర్యనారాయణ మహంతి రాంబాబుపై దాడి చేయడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబు భార్యను విడిచి పెట్టి ఒంటరిగా జీవిస్తున్నట్లు చెల్లయ్య వలస గ్రామస్తులు తెలిపారు. దాబా యజమాని ఎం.గణపతి ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. సూర్యనారాయణ మహంతిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు.

నా మనవరాళ్లకు దిక్కెవరు..?


రోదిస్తున్న కుటుంబసభ్యుల నడుమ చిన్నారులు

తల్లి చనిపోయిందని తెలుసు. కానీ ఆత్మహత్య చేసుకుందంటే అర్థం చేసుకునేంత వయసు ఆ పిల్లలకు లేదు. నాన్న ఉన్నాడని తెలుసు. కానీ తమను వద్దనుకుంటున్నాడని చెబితే నమ్మేంత ఆలోచన కూడా ఆ చిన్నారులకు లేదు. లోకం తెలీని వయసులో ఆ పసివాళ్లకు అమ్మ దూరమైపోయింది. నాన్న దూరం పెట్టేశాడు. ఇక తమ మనవరాళ్లకు దిక్కెవరని తాతయ్య, అమ్మమ్మ కడుసు భాస్కరరావు, రఘుపతి కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

చీడిపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కడుసు భాస్కరరావు, రఘుపతిల కుమార్తె యమునకు సారవకోట మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాదిలాపు యయాతితో 2017లో వివాహం జరిగింది. వీరు విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలో నివాసం ఉండేవారు. యయాతి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలు ఉన్నాయి. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక ఈ నెల 3న యమున ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై యయాతి యమున తల్లిదండ్రులకు సమాచారం అందించి పోస్టుమార్టం అయిన తర్వాత కుమార్తె మృతదేహంతో పాటు ఇద్దరు కుమార్తెలను బుధవారం రాత్రి చీడిపూడిలో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కనీసం దహన సంస్కారాలకు కూడా హాజరు కాలేదని వృద్ధులు కన్నీరుమున్నీరయ్యారు. తమ మనవరాళ్లకు దిక్కెవరని గుండెలవిసేలా రోదించారు.

– సారవకోట

క్లుప్తంగా

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



మండల కేంద్రంలోని పురుగు మందుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కురుపాం: మండల కేంద్రంలో ఉన్న పలు పురుగు మందుల విక్రయ దుకాణాల్లో వ్యవసాయాధికారి పువ్వల నాగేశ్వరరావు, రైతు భరోసా కేంద్రం వీహెచ్ఏ మౌనిక గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన నిషేధిత క్రిమిసంహారక మందు (గ్లైసైల్) అక్రమ రవాణా అనే కథనంపై స్పందించిన పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు కురుపాం మండల వ్యవసాయాధికారులు స్థానిక పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించి, పురుగుమందుల నిలవలను క్షుణ్ణంగా పరిశీలించారు.

రెండు కేంద్రాల్లో ఎడ్‌సెట్ -2024 రేపు



దాక్టర్ ఎన్.శ్రీనివాస మోహన్, ఎడ్‌సెట్ జిల్లా కో-ఆర్డినేటర్

విజయనగరం అర్బన్: బీఈడీ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ -2024 ప్రవేశ పరీక్షను ఈ నెల 8న జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో జరుగుతుందని ఎడ్‌సెట్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసమోహన్ తెలిపారు. జిల్లాలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య ఈ పరీక్ష జరుగుతుందని కనీసం ఒక గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 850 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు.

డైరెక్టర్ పదవులకు రాజీనామా



నౌపాడ శ్రీనివాసరావు



రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైనందున నైతిక బాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రేగాన శ్రీనివాసరావు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి నౌపాడ శ్రీనివాసరావు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ రాజీనామా పత్రాలను మెయిల్ ద్వారా రాష్ట్ర కార్యాలయాలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఇంతవరకు తమకు సహకరించిన పార్టీ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పర్యావరణ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

విజయనగరం అర్బన్: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణంపై వివిధ అంశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని గరజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాసరచనలో జి.జ్యోతికకు ప్రథమ, కె.లక్ష్మీ శ్రీవాణి, కె.తనూజ, బి.సాయిసంయుక్తలకు ద్వితీయ బహుమతులు లభించాయి. వక్తృత్వ పోటీలో కె.లక్ష్మీ శ్రీవాణి, కె.తనూజ ప్రథమ బహుమతులు, జి.జ్యోతిక ద్వితీయ బహుమతి సాధించారు. చిత్రలేఖనంలో బి.బిందుప్రియకు ప్రథమ, ఒ.శశివర్ధన్‌కు తృతీయ బహుమతి లభించాయని ప్రకటనలో వివరించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

9న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొబ్బిలి: పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాలలో 1969-70 పదో తరగతి, రాజా కాలేజీలో 1970 నుంచి 1976 వరకూ ఇంటర్, బీకాం డిగ్రీ చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ కోఆర్డినేటర్ సీతారామ ప్రసాద్, ప్రధాన సలహాదారు ఆర్‌వీఎస్ రాఘవరావు తెలిపారు. రాజా కాలేజీలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనంలో ఉపాధ్యాయ, అధ్యాపకులను సత్కరించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మరిన్ని వివరాలకు పూర్వ విద్యార్థులు సెల్: 96184 04013ను సంప్రదించాలని కోరారు.

కాటేసే కాలం

- ఖరీఫ్‌లో విషసర్పాలతో జాగ్రత్త
- వానాకాలంలో పాముల సంచారం ఎక్కువ
- పొలాల్లోనే ప్రమాదం
- రైతులు అప్రమత్తంగా ఉండాలి





పొలం పనులు చేస్తున్న రైతు

సీతంపేట/పార్వతీపురం టౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానాకాలం ప్రారంభంలో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈనెల నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విషకీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గతేడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 12 మంది రైతులు పాము కాటుతో ప్రాణాలు కోల్పోగా, 15 మంది ఆస్పత్రులకు వెళ్లి కోలుకున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పొలాల గట్ల మీద వెళ్లేటపుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకువెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతాయి. తడిగా ఉంటే కప్పలు చేరతాయి. వాటిని తినడానికి పాములు చేరతాయి. అలాగే తేళ్లు వంటి ప్రమాదకర ప్రాణులు తిరుగాడే ఆస్కారముంది. ఇంటిచుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరతాయి. చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

అన్ని పాములు ప్రమాదకరం కాదు..

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాములే ప్రమాదకరమైన సర్పజాతులు. వాటితోనే ఎక్కువ ప్రమాదముంటుంది. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం ప్రమాదం లేని మాములు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలా మంది షాక్‌తోనే ప్రాణం మీదకి తెచ్చుకుంటారు. ఇంట్లోవారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడిస్తే బాధితుడు భయాందోళనకు గురై పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.

ఇలా చేయకూడదు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ ఆ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

పాము కాటు లక్షణాలు

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే ప్రమాదముందని పేర్కొంటున్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టువేయాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్టు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

అందుబాటులో వ్యాక్సిన్



పాముకాటు బారిన పడిన వ్యక్తికి పీహెచ్‌సీలో చికిత్స అందుబాటులో ఉంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్‌వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. కరిచిన వెంటనే ముందుగా గాయం పై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకోవాలి. గాయాన్ని బట్టి రెండుసార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. ముఖ్యంగా భయపడకుండా ఉండాలి.
కె.విజయపార్వతి, డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీల్లో ఇంజక్షన్లు



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనమ్ మందు అందుబాటులో ఉంది. పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పాము కరిచిన వెంటనే ఏదైనా వాహనంలో ఆరోగ్యకేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు.
- డాక్టర్ బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం

పాములు-విషప్రభావం..

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.
నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.
రక్తపింజర: ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.
జెర్రిపోతు, నీరుకట్టు: ఇవి కాటేసినా విషం ఉండదు. అయితే ఇవి కాటువేసినా ఆస్పత్రిలో చికిత్స అవసరం.

కూటమి శ్రేణుల కవ్వింపు

- కులం పేరుతో దూషణ, ఆటో ధ్వంసం



ఆవేదన వ్యక్తం చేస్తున్న దాలప్పడు



టీడీపీ-జనసేన కార్యకర్తల దాడిలో ధ్వంసమైన ఆటో

నెల్లిమర్ల రూరల్: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమనే మాటను మరిచిపోయి కూటమి శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. బలహీనవర్గాలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో పలువురు టీడీపీ-జనసేన కార్యకర్తలు.. డీజే సౌండ్‌లతో భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీని బుధవారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు, నిరుపేద కుటుంబానికి చెందిన అలజంగి దాలప్పడు ఇంటి ఎదుట చేశారు. దాలప్పడు కుటుంబసభ్యులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసి ఆటో అద్దాలను, ఇంటి ఎదుట ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు దాలప్పడు మాట్లాడుతూ..రాత్రి 10.30 గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తుండగా ర్యాలీలో ఉన్న పతివాడ అప్పారావు, మొయిద లక్ష్మణరావు, వలిరెడ్డి ప్రసాద్, తదితరులు కేకలు వేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపాడు. ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నారని, నెమ్మదిగా ఉండాలని చెప్పిన పాపానికి, కులం పేరుతో, తీవ్ర పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తీవ్ర స్థాయిలో గొడవపడి ఇంటి ముందున్న ఆటోను సదరు ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారని చెప్పాడు. ఈ మేరకు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీస్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

ఇసుక లారీ పట్టివేత

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు గురువారం పట్టుకున్నారు. పట్టుకున్న లారీని గుర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని నెల్లిమర్ల ఎస్ఈబీ అధికారులు హెచ్చరించారు.

వేధింపుల భర్త అరెస్ట్

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని ఎస్సీ కాలనీకి చెందిన మాధురి గతనెల 22వతేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ ఈనెల 1వతేదీన మృతిచెందింది. మాధురి భర్త కృష్ణ వేధింపుల వల్లను ఆమె మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, దర్యాప్తు నిర్వహించి, భర్త కృష్ణను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.నరసింహమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు.

విత్తనోత్పత్తి రైతులే చేసుకోవాలి

- సొంతంగా తయారు చేస్తే నాణ్యమైన విత్తనాలు



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో సాగులో ఉన్న వరి పంట

విజయనగరం ఫోర్ట్:

పంటల సాగుకు విత్తన ఎంపికే కీలకం. విత్తు కొద్దీ చెట్టు అనే సామెత నిజం కావాలంటే ముందు విత్తనం నాణ్యమైనదై ఉండాలి. వ్యవసాయంలో మంచి విత్తనం సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించడంతో పాటు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చు. గతంలో విత్తనాలను పూర్తి స్థాయిలో రైతులే సొంతంగా తయారు చేసుకునే వారు. అయితే ఇటీవల కాలంలో రైతులు విత్తనాలు తయారు చేసుకోవడం చాలా వరకు తగ్గించేశారు. ప్రస్తుతం రబీలో వరి పంట సాగులో ఉంది. రైతులకు అవసరమయ్యే విత్తనాల్లో కనీసం సగం విత్తనాలు అయినా రైతు తయారు చేసుకుంటే మంచిదని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల తయారు చేయని రైతులు

జిల్లాలో రైతులు విత్తనాలు తయారు చేయడం లేదు. గతంలో తనకు ఉన్న పొలంలో విత్తనాల కోసం కొన్ని సెంట్లలో సాగు చేసేవారు. వాటిని విత్తనాల కోసం ప్రత్యేకంగా జాగ్రత్తలు పాటిస్తూ నిల్వ చేసుకునేవారు. దీంతో రాయితీ విత్తనాలు పెద్దగా రైతులకు అవసరం పడేవి కాదు.

ఖరీఫ్‌లో 90 వేల హెక్టార్లలో వరి సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట90 వేల హెక్టార్లలో సాగవుతోంది. రబీలో 2 వేల నుంచి 3 వేల హెక్టార్ల వరకు సాగవుతుంది. ఈ విస్తీర్ణానికి మొత్తంగా 80 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం పడతాయి.

విత్తనం తయారీ ఇలా:

వరి పండించిన పొలాన్ని విత్తనోత్పత్తి కోసం ఎంపిక చేసుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది. సరైన వరి వంగడాలను ఎన్నుకున్న తర్వాత పండించాలనుకున్న వరి రకాలలో బ్రీడర్ లేదా మూల విత్తనాన్ని సేకరించాలి. విత్తన శుద్ధి కోసం ఒక కిలో విత్తనాలకు 3 గ్రాముల కార్బండిజిమ్ మందును కలుపుకోవాలి. తర్వాత ప్రధాన పొలానికి 10 నుంచి 15 రోజులు నీరు పెట్టి మురుగుదమ్ము చేసుకోవాలి. విత్తనం నాటిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలిబాటలు తీసుకోవాలి. సిఫార్సు చేసిన నత్రజని, బాస్వరం, పొటాష్ ఎరువులు భూసారాన్ని బట్టి వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాటిన 3నుంచి 5 రోజులు, 15 నుంచి 30 రోజులకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి.

కేళీల ఏరివేత

సాధారణ పంటకు చేపట్టిన మాదిరిగానే నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. వరి పంట అంకురం దశనుంచి పక్వానికి వచ్చేవరకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. విత్తనోత్పత్తి తయారు చేసుకునే పద్ధతిలో ముఖ్యమైన చర్యలు కేళీలను తీసివేయడం. కేళీలు తీసివేసే పనిని రింగింగ్ అంటారు. కనీసం 3-4 దశల్లో కేళీలు తీసివేయాలి. విత్తనంలో కేళీ గింజలు ఒకటి ఉంటే వచ్చే సంవత్సరానికి 1000 గింజలకు పెరుగుతాయి.

విత్తనాల ఖర్చు తగ్గుతుంది

రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటే నాణ్యమైన విత్తనాలు వస్తాయి. అంతేకాకుండా విత్తనాల కోసం పెట్టే ఖర్చు కూడ తగ్గుతుంది.
నాగభూషణం, ఏడీఏ, విజయనగరం సబ్ డివిజన్

ఒక్క ఫోన్ చేస్తే చాలు

లక్కవరపుకోట: సమాజంలో జరుగుతున్న విపత్కర పరిస్థితుల కారణంగా మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విషయాలకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్లను ప్రవేశపెట్టాయి. వాటిని వినియోగించుకోవాలని ఇప్పటికే పలు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

100 టోల్ ఫ్రీ నంబర్

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నుంచైనా వంద నంబర్ డయల్ చేస్తే ఆ కాల్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కి చేరుతుంది. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి ఎలాంటి విపత్కర పరిస్థితిలో ఉన్నారో చెబితే చాలు. బాధితులు ఏ ప్రాంతం నుంచి ఫోన్ చేశారో తెలుసుకుంటారు. సమీపంలో ఉన్న పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేసి గరిష్ఠంగా 10 నిమిషాల లోపు అక్కడికి పోలీసులు వస్తారు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా ఆ ప్రదేశానికి పోలీసులు చేరుకుని బాధితులు ఎలాంటి పరిస్థితిలో ఉన్నా కాపాడతారు. అవసరమైతే ఘటనా స్థలానికి చేరుకునేంతవరకూ పోలీసులు బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతూ వారికి పలు సూచనలు, సలహాలు ఇస్తూ ధైర్యం చెబుతారు.

112

కేంద్ర హోం శాఖ ఈ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.దేశంలో ఎక్కడినుంచైనా ఏ సమయంలోనైనా కాల్ చేయవచ్చు. బాధితులు ఏ రాష్ట్రం నుంచి ఫోన్ చేస్తే ఆరాష్ట్రంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ కాల్ వెళ్తుంది.

182

మహిళలు ఒంటరిగా రైళ్లో ప్రయాణిస్తున్నప్పుడు ఎవరి నుంచైనా వేధింపులకు గురైనా, ఆపదలో చిక్కుకున్నా అలాంటి సందర్భాల్లో 182 నంబర్‌కు ఫోన్ చేయాలి. ఆ కాల్ రైల్వే డివిజన్ పరిధిలోని రక్షక దళం(ఆర్‌పీఎఫ్)కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు అందించిన వివరాల ఆధారంగా ఆ రైల్లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది వెంటనే బోగీలోకి చేరుకుని సాయం అందిస్తారు.

9121211100 వాట్సాప్ నంబర్

మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట ఈ నంబర్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తీసుకు వచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ నంబర్‌కు వాట్సాప్ చేయడం, లోకేషన్ పంపించడం ద్వారా ఆపదలో ఉన్నామని పోలీసులకు తెలియజేయవచ్చు. పోలీసులు వెంటనే స్పందించి అవసరమైన సాయం అందిస్తారు. ఈ నంబర్ 24 గంటలు పనిచేస్తుంది.



112 మొబైల్ యాప్

కేంద్ర హోం శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- గూగుల్ ప్లేస్టోర్‌లో దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రొఫైల్‌లో పేరు, ఫోన్ నంబర్, పుట్టిన తేదీ, రాష్ట్రం తదితర వివరాలను నమోదు చేసుకోవాలి.
- ఆపదలో ఉన్నప్పుడు ఆ సమాచారం పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు తెలిసేలా ముఖ్యమైన వారి ఫోన్ నంబర్‌లు అందులో సేవ్‌చేసుకోవచ్చు.
- హోం స్క్రీన్‌పైకి వెళ్లిన వెంటనే పోలీస్ అని కనిపిస్తుంది అత్యవసర మీటను నొక్కితే చాలు వారు ఆపదలో ఉన్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందుతుంది. బాధితులు ఉన్న లోకేషన్ వివరాలు కూడా చేరుతాయి.వెంటనే 112 నంబర్ నుంచి కాల్ వస్తుంది. సమీపంలో గల పోలీసులు, గస్తీ వాహనాలు అప్రమత్తమై సాయిమందిస్తాయి.

మన్యం తాండ్ర మహారుచి

- కొండమామిడి పండ్లతో తాండ్ర తయారీ
- కిలో రూ.200 నుంచి 300ల మధ్య విక్రయం
- ఆవకాయ చేసుకునేందుకు అంబుల్లి తయారీ
- వారపు సంతల్లో విక్రయాలు
- మైదాన ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు



తాండ్రను ఎండలో ఆరబెట్టిన గిరిజనులు

సీతంపేట:

మన్యం అటవీ ప్రాంతంలో లభించే మామిడి పండ్లతో తయారు చేసే తాండ్ర తింటే మహారుచిగా ఉంటుంది. గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా తాండ్రను తయారు చేస్తారు. ఎలాంటి రసాయనాలు వినియోగించరు. అందుకే మన్యం తాండ్రకు మంచి గిరాకీ ఉంటుంది. గిరిజన గ్రామాల మహిళలు ప్రస్తుతం ఇళ్లముందు చేటలు, చాపలు, ప్లేట్లతో మామిడి తాండ్ర తయారీలో నిమగ్నమయ్యారు. వారపు సంతలో తాండ్ర కిలో రూ. 200 నుంచి 300ల వరకు విక్రయిస్తున్నారు. మామిడి పండ్ల సీజన్ అయిపోయినా తాండ్రను భద్ర పరుచుకొని తినే అవకాశం ఉండడంతో డిమాండ్ నెలకొంది.

సహజ సిద్ధంగా తయారీ...

మన్యంలో గిరిజన గ్రామాలకు ఆనుకుని ఉన్న కొండ అటవీ ప్రాంతాల్లో మామిడి చెట్లకు కాసే మామిడి పండ్లను ఇంటిల్లిపాది ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లి సేకరిస్తారు. వాటిని శుభ్రపరిచి పెద్దడబ్బాలు, బిందెలలో వేసి రోకలితో దంచుతారు. దంచగా వచ్చిన మామిడి రసాన్ని చేటలు, పేట్లు, చాపలలో పలుచుగా, పొరలుపొరలుగా వేసి వారం పదిరోజులు ఆరబెడతారు.

అంబుల్లి అదుర్స్...

మామిడి పండ్లను కోసి వాటి తొక్కలను, టెంకలను వేరు చేసి ఎండబెడతారు. తొక్కలను కొందరు కా రంతో, మరికొందరు బెల్లంతో కలిపి ఎండబెడతా రు. బాగా ఎండిన తర్వాత వీటిని డబ్బాలలో నిల్వచేసి తింటారు. వీటిని అంబుల్లి అంటారు. మైదాన ప్రాంతాల్లో వీటికి కూడా మంచి డిమాండ్ ఉంది. బుట్టలు లెక్కన విక్రయిస్తారు. ఒక్కో బుట్ట అంబు ల్లి రూ.400ల వరకు విక్రయిస్తారు. మైదాన ప్రాంత వాసులు తీపి ఆవకాయ మాదిరిగా తయారు చేసి తింటారు.

మార్కెట్‌లో ధర తక్కువ



మార్కెట్‌లో తాండ్రకు, అంబుల్లికి ధరలు తక్కువగా ఉంటున్నాయి. ఎప్పుడు ఒకే ధరకు విక్రయించాల్సిన పరిస్థితి. గతేడాది కూడా ఇవే ధరలు ఉన్నాయి. ఇప్పుడు కూడా మార్పు లేదు. ఇంటి అవసరాలకు ఉంచుకోగా మిగిలినది సంతల్లో విక్రయిస్తాం. - బాపయ్య, దీసరిగూడ